


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 19-06-2022 సంపుటి : 03 సంచిక : 267 పేజీలు : 4 వెల : రూ 3-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


# ఏపీలో పాలిసెట్-2022 ఫలితాలు విడుదల




అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన పాలిసెట్-2022 పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విజయవాడలోని గేట్ వే హోటల్‌లో ఫలితాలను విడుదల చేశారు. 2022-23 విద్యాసంవత్సరానికి గాను మే 29న రాష్ట్రవ్యాప్తంగా 404 పరీక్ష కేంద్రాల్లో పాలిసెట్ ప్రవేశపరీక్షలను నిర్వహించారు. లక్షా 37,371 మంమది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా లక్షా 25 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాల్లో 91.84 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారని మంత్రి పేర్కొన్నారు. బాలురు 90.56 శాతం, బాలికలు 93.96 శాతం ఉత్తీర్ణత సాధించి బాలురపై అధిక్యత సాధించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం.

# అగ్నిపథ్ సెగ..



విశాఖ: అగ్నిపథ్ ఆందోళనల కారణంగా నిన్న తెలంగాణ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో తీవ్ర విధ్వంసం చోటుచేసుకున్న నేపథ్యంలో రైల్వే శాఖ మరింత అప్రమత్తం అయింది. అగ్నిపథ్ సెగ ఆంధ్రప్రదేశ్‌కి తగలకుండా ఉండేందుకు రైల్వే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. భద్రతా కారణాల దృష్ట్యా విశాఖపట్నం రైల్వేస్టేషన్‌ను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇవాళ మధ్యాహ్నం 12గంటల వరకు

## విశాఖపట్నం రైల్వేస్టేషన్ మూసివేత

స్టేషన్‌ను మూసివేస్తున్నామని.. స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. కాగా, మరోవైపు విజయవాడ నుంచి వచ్చే రైళ్లన్నీ దువ్వాడ వద్ద, హవ్‌డా నుంచి వచ్చే వాటిని కొత్తవలస వద్ద నిలిపివేసి, దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. విశాఖ రైల్వే స్టేషన్‌కు రైళ్లు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే స్టేషన్‌కు అర కిలోమీటర్ మేర ముందే బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల వరకు ఉన్న ప్రయాణికులను తనిఖీ చేసి స్టేషన్‌లోకి అనుమతించారు. అలాగే స్టేషన్ రోడ్డులోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి కార్యాలయం వద్ద భారీ స్థాయిలో బలగాలను మోహరించారు. విశాఖ భద్రతా వ్యవహారాలను సీపీ శ్రీకాంత్ స్వయంగా పరిశీలిస్తున్నారు. విశాఖ రైల్వే స్టేషన్ మూసివేసిన కారణంగా విశాఖ వెళ్లాల్సిన పలు రైళ్లను దువ్వాడ, కొత్తవలస, అనకాపల్లి స్టేషన్ల వద్దే అధికారులు నిలిపివేయనున్నారు. విశాఖ-గోదావరి ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-విశాఖ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబద్-విశాఖ గరీబ్‌రథ్, లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖ, కడప-విశాఖ తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లను దువ్వాడ వద్ద నిలిపివేయనున్నారు. దిఘా-విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను కొత్తవలస వద్ద నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-విశాఖ, తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ రైళ్లను అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో నిలిపివేయనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. నిరుద్యోగులు, ప్రజలు ఎలాంటి ఆందోళనలకు దిగొద్దని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్. శ్రీకాంత్ సూచించారు. విశాఖలో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తోన్న సీపీ యువతకు, స్థానిక ప్రజలకు పలు సూచనలు చేశారు. యువకులు ఎటువంటి అల్లర్లకు పాల్పడొద్దన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల ధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విశాఖ రైల్వే స్టేషన్, ఇతర ప్రాంతాల వద్ద.. కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన కార్యాలయాల ఆస్తుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సెక్షన్ 151, 153 రైల్వే యాక్ట్ ప్రకారం ఆస్తులు ధ్వంసం చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇలాంటి కేసుల్లో 5 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష ఉంటుందని హెచ్చరించారు. నిరుద్యోగులు ఇలాంటి కేసుల్లో ఇరుక్కొని బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సీపీ సూచించారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో వాల్తేరు డివిజన్ అధికారులు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు వంటి వివరాలపై సమచారం కోసం 0891-2746330, 0891-2744619, 81060-53051, 81060-53052, 85000-41670, 85000-41671 నంబర్లను సంప్రదించాలని రైల్వే అధికారులు ప్రయాణికులకు సూచించారు.

# మోసం చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనుచరుడిని అరెస్టు చేయాలి: నారా లోకేశ్



అమరావతి : అమాయక గిరిజనుల్ని ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మోసం చేస్తోన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అనుచరుడు దూడ విక్టర్‌బాబు దందాలపై దర్యాప్తు చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. మోసపోయిన గిరిజనులు ఆందోళన సమాచారం తెలుసుకుని వారికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం చెట్లవాడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దూడ విక్టర్ బాబు ఎమ్మెల్సీ అనంతబాబు కీలక అనుచరుల్లో ఒకరని, అనంతబాబు, వైసీపీ పేరు చెప్పుకుని గిరిజనుల్ని మోసగిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం రాగానే ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో అటెండర్ ఉద్యోగాలు వేయిస్తానని ఏడుగురు గిరిజనుల వద్ద పది లక్షల రూపాయలు వసూలు చేసాడని ఆరోపించారు. వారికి ఉద్యోగాలు వేయించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసగించారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మోసపోయిన గిరిజనులకు వెంటనే వడ్డీతో సహా డబ్బులు తిరిగి ఇప్పించా లని, మోసం చేసిన విక్టర్‌బాబుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని నారా లోకేశ్ డిమాండ్ చేశారు.

# మహిళలు పురోగమిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం

## మహిళల సంక్షేమం కోసం అన్ని రంగాల్లో విధానాలు
## గుజరాత్ పర్యటనలో ప్రధాని మోడీ



గాంధీనగర్,జూన్18(): భారత్ అభివృద్ధి చెందాలంటే మహిళలకు సాధికారత కల్పించడం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్‌లో రూ.21 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. మహిళల సంక్షేమం కోసం అన్ని రంగాల్లో విధానాలు రూపొందిస్తునట్లు తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం గడిచిన ఎనిమిదేళ్లలో మహిళలకు సాధికారత కల్పించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశ అభివృద్ధికి మహిళల సాధికారత అత్యావశ్యకమని ఉద్ఘాటించారు. ఆర్మీ నుంచి గనుల దాకా.. అన్ని రంగాల్లో మహిళల సంక్షేమం కోసం విధానాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఇప్పుడు అన్ని మార్గాలు తెరిచే ఉన్నాయని అన్నారు. గుజరాత్ పర్యటనలో ఉన్న ఆయన వడోదరలో రూ.21వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గిరిజన మహిళలకు పోషకాహారం అందించే కార్యక్రమాన్ని సైతం ప్రారంభించారు. అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న మోదీ'21వ శతాబ్దంలో భారత్ అభివృద్ధి చెందాలంటే మహిళలకు సాధికారత కల్పించడం అవసరం. ఇందుకోసమే ప్రభుత్వం విధానాలు రూపొందించింది. మహిళలు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకునేందుకు అన్ని అడ్డంకులను తొలగించింది' అని మోదీ వివరించారు.

# రోడ్డు ప్రమాద బాధితులను దగ్గరుండి ఆస్పత్రికి తరలించిన చంద్రబాబు

విజయనగరం: చీపురుపల్లి మండలం పుర్రేయవలస జంక్షన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో చీపురుపల్లిలో రోడ్ షో ముగించుకుని అటువైపు వస్తున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వాహనం దిగి క్షతగాత్రులకి సహాయక చర్యలు చేపట్టారు. తన కాన్వాయ్‌లోని అంబులెన్సులో విజయనగరం తరలించారు. చీపురుపల్లి మండలం పుర్రేయవలస జంక్షన్‌లో శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వెళ్తూ, తమ ముందు వెళ్తున్న రిక్షాను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలై, రోడ్డుపై పడిపోయారు. అక్కడున్న వారు 108 వాహనానికి సమాచారం అందజేసినప్పటికీ, వాహనం రావడం ఆలస్యమయింది. ఇంతలో ఆ మార్గంలో విశాఖఎయిర్ పోర్టుకు వెళ్తున్న చంద్రబాబు ఘటన స్థలంలో కాన్వాయ్ నుంచి కిందికి దిగి, క్షతగాత్రులను తన కాన్వాయ్‌లో ఉన్న అంబులెన్సు ద్వారా విజయనగరం తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు.



# అనుభవం ఉంటే సరిపోదు.. నలుగురికి ఉపయోగపడాలి: మంత్రి బొత్స



తాడేపల్లి: దేశరాజకీయాల్లో చంద్రబాబులాంటి పనికిమాలిన నేత లేరని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు కేవలం తప్పుడు విమర్శలకే పరిమితమయ్యారంటూ మండిపడ్డారు. ఈ మేరకు తాడేపల్లిలో మంత్రి బొత్స మీడియాతో మాట్లాడుతూ.. బైజూస్‌పై చంద్రబాబు అవహేళనగా మాట్లాడారు. బైజూస్ సంస్థ గురించి చంద్రబాబుకు తెలుసా??. మీ అబ్బాయిని ఇంగ్లీష్ మీడియంలో ఎందుకు చదివించారు?. చంద్రబాబు కుటుంబ సభ్యులు ఇంగ్లీష్ మీడియంలో చదవాలి. పేదలు ఇంగ్లీష్ మీడియంలో చదవొద్దా?. అనుభవం ఉంటే సరిపోదు.. నలుగురికి ఉపయోగపడాలి. బైజూస్ ఒప్పందం తప్పని ఒక్కరితోనైనా చెప్పించగలరా?. డిబేట్‌కు ఎవరు వస్తారో రండి.. మేం సిద్ధంగా ఉన్నాం. 35 లక్షల మంది విద్యార్థులకు బైజూస్‌తో ఉపయోగం. చంద్రబాబుకు మతిస్థిమితం పోయిందని మంత్రి బొత్స అన్నారు. "సామాజికి న్యాయంపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు. వైఎస్సార్ హయాంలోనే విశాఖ అభివృద్ధి జరిగింది. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చంద్రబాబులా మేం ప్రభుత్వ పాఠశాలలు మూసివేయలేదు. నాడు- నేడు వంటి విప్లవాత్మక పథకాలు అమలు చేస్తున్నాం. మా ప్రభుత్వ నిర్ణయాలతో విద్యార్థుల శాతం పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారని" మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న హర్యానా గవర్నర్ దంపతులు

తిరుమల: తిరుమలలోని శ్రీవారిని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ దంపతులు దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం ఆలయానికి చేరుకున్న దత్తాత్రేయకు ఆలయ ఈవో ధర్మారెడ్డి , ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. దర్శన అనంతరం గవర్నర్ దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు, టీటీడీ ముద్రించిన క్యాలెండర్‌ను, ఫొటోను అందజేశారు. నిన్న శ్రీవారిని 76,407 మంది భక్తులు దర్శించుకోగా 39,938 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.28 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు. వారంతపు సెలవు దినాలు కావడంతో ఇవాళ అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో కిటకిటలాడు తున్నాయి. స్వామి వారి దర్శనానికి 9 గంటల సమయం పడుతుందని వెల్లడించారు.



# ఈ నెల 26న జాతీయ లోక్ అదాలత్

ఒంటిమిట్ట, కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం సిద్ధవటం సివిల్ జడ్జి కోర్టు నందు శనివారం మీడియా సమావేశంలో సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ మాట్లాడుతూ ఈ నెల 26న జాతీయ లోక్ అదాలత్ సిద్ధవటం కోర్టు ప్రాంగణంలో జరుగుతుందని సంబంధిత కక్షిదారులు అడ్వకేట్ పోలీస్ శాఖ వారు పాల్గొని ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ అన్నారు సివిల్ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవడానికి మంచి అవకాశమని అన్నారు అలాగే వివాహ సంబంధ దీర్ఘకాలిక కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడానికి మంచి అవకాశం అని సిద్ధవటం ఒంటిమిట్ట చుట్టుపక్కల పల్లెల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సిద్ధవటం సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ తెలియజేశారు

# సంపాదకీయం

ఆదివారం 19-06-2022

## అగ్నిపథ్ అసలు కథ ఇదీ

దేశానికి సేవలు అందించాలనే ఆసక్తిగల యువత ను త్రివిధ దళాలలో నియమించేందుకు కేంద్రం తాజాగా అగ్నిపథ్ పథకం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ పథకానికి సానుకూల స్పందన రావడం మాట అటుంచితే.. యువత నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కేవలం నాలుగేళ్లు సైనిక సర్వీస్‌లో ఉంచి ఆ తర్వాత ఇంటికి పంపిస్తే తమ భవిష్యత్తు ఏంటి? అని ప్రస్తుతం ఆర్మీ పరీక్షలకు సిద్ధమవుతున్న చాలా మంది అభ్యర్థులు నిరసనలు చేస్తున్నారు. ఈ ఆర్మీ పథకాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ కూడా చేస్తున్నారు. నాలుగేళ్ల కాలపరిమితితో అగ్నిపథ్ కింద స్వచ్ఛందంగా సైన్యంలో చేరేవారికి మొదటి ఏడాది వేతనంగా రూ. 4.76 లక్షలు చెల్లిస్తారు. నాలుగో సంవత్సరానికి దీనిని రూ. 6.97 లక్షలకు పెంచుతారు. పలురకాల అలవెన్స్ లు కూడా లభిస్తాయి. నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత రూ. 11.7 లక్షలు చెల్లిస్తారు. ఈ మొత్తంపై పన్ను ఉండదు. నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత రెగ్యులర్ కేడర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరాలు, అర్హతలను బట్టి 25 శాతం మందిని తీసుకుంటారు.'భారత్ కే అగ్నివీర్ పేరు'తో ప్రారంభించిన ఈ పథకంలో నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీలో నాలుగేళ్ల పాటు సేవలు అందించేలా రూపకల్పన చేశారు. సాయుధ దళాలకు యువ రూపాన్ని కల్పించేందుకు ఈ పథకం కింద చర్యలు తీసుకోనున్నట్టు రక్షణ మంత్రి చెప్పారు. యువతకు కొత్త సాంకేతికతలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వివిధ రంగాల్లో భిన్న నైపుణ్యాలున్న వారికి ఈ పథకం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు.అఖిల భారత స్థాయిలో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఉంటాయి. 17.5 నుంచి 21 ఏళ్ల వయసులోపు వారిని చేర్చుకోవాలని అనుకుంటున్నాం. ఒక్కసారి ఎంపికైతే అగ్నివీర్స్ నాలుగేళ్లపాటు సేవలు అందిస్తారు"అని సైనిక దళాల అడిషనల్ సెక్రటరీ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ పూరి తెలిపారు. ఈ పథకం కింద సైనిక దళాల్లో యువతీ, యువకులు చేరే అర్హత ఉంటుంది. వయసు 17-21 మధ్య ఉండాలి. ప్రస్తుతం సైనిక దళాల్లో చేరేందుకు ఉన్న శారీరక సామర్థ్యం, వైద్య అర్హతలే వర్తిస్తాయి. 10, 12వ తరగతి ఉత్తీర్ణులైన వారికి తీసుకుంటారు.అగ్నిపథ్ స్కీమ్ కింద యువకులు సైన్యంలో చేరి దేశానికి సేవ చేస్తారు. రక్షణ దళాల ఖర్చు, వయసు ప్రొఫైల్ తగ్గించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఒక భాగం. నాలుగేళ్ల సర్వీస్‌తో దాదాపు 80 శాతం మంది సైనికులకు విధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. తదుపరి ఉపాధి మార్గాల కోసం సాయుధ దళాల నుంచి సహాయం పొందుతారు. అనేక సంస్థలు దేశానికి సేవ చేసిన, శిక్షణ పొందిన క్రమశిక్షణ కలిగిన యువతకు ఉద్యోగాలను రిజర్వ్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి.టూర్ ఆఫ్ డ్యూటీ కాన్సెప్ట్ కింద పెద్ద సంఖ్యలో రిక్రూట్ చేసుకుంటే వేతనం, అలెవెన్సులు పెన్షన్‌లలో వేల కోట్లు ఆదా అవుతుందని కేంద్రం ప్రాథమికంగా అంచనా వేసింది. రిక్రూట్ చేసుకున్న యువతలో అత్యుత్తమ పనితీరు ఉన్నవారిని సేవలో కొనసాగించే అవకాశం ఉంది. ప్రపంచంలో ఎనిమిది దేశాలలో ఇలాంటి నియామక నమూనాలను అధ్యయనం చేసింది రక్షణ శాఖ. సైనిక నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త పథకం 'అగ్నిపథ్'పై దేశవ్యాప్తంగా యువత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా వయో పరిమితి విషయంలో అభ్యంతరాలు వస్తున్నాయి. అర్హత వయసును 17.5 నుంచి 21 ఏళ్లుగా నిర్ణయించడంపై మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో యువత ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నియామకాలకు సంబంధించి వయో పరిమితిని మరో రెండేళ్లకు పెంచి గరిష్ట వయసు 23గా నిర్ణయించింది. కొవిడ్ కారణంగా గత రెండేళ్ల నుంచి సైనిక నియమకాలు చేపట్టకపోవడం, ఆశావాహుల నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం కొంత సడలింపు ఇచ్చింది. 2022 నియమకాలకు సంబంధించి అర్హతను గరిష్టంగా 23 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. 'అగ్నిపథ్' సర్వీస్ పథకం కింద తొలిబ్యాచ్‌లో 45వేల మందిని నియమించనున్నారు. టూర్ ఆఫ్ డ్యూటీ పేరిట ప్రత్యేక ర్యాలీలు నిర్వహించి ఈ నియామకాలను చేపడతారు. నాలుగేళ్ల కాల పరిమితితో కూడిన ఈ సర్వీసులకు ఎంపికైన అభ్యర్థులకు సాంకేతిక నైపుణ్యంతో పాటు క్రమశిక్షణ కలిగినవారిగా తీర్చిదిద్దనున్నారు. ఈ సర్వీసు పూర్తయిన తర్వాత ప్రతిభ ఆధారంగా 25 శాతం మందిని శాశ్వతంగా విధుల్లో కొనసాగించనున్నారు. వీరికి మెరుగైన ప్యాకేజీ అందజేస్తారు.మరోవైపు, ఈ పథకంపై గత రెండు రోజులు నుంచి దేశంలోని పలు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నిరసనలు గురువారం హింసాత్మకంగా మారాయి. బిహార్‌లో ఆందోళనకారులు పలు రైళ్లకు నిప్పుపెట్టి, రైల్వే స్టేషన్‌లపై కూడా దాడులు చేశారు. మధ్యప్రదేశ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. పాత విధానంలోనే సైనిక నియమకాలను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పలుచోట్ల రాళ్ల దాడులు చోటుచేసుకున్నాయి.కాగా, ఈ ఏడాది రిక్రూట్‌మెంట్ మరో 90 రోజుల్లో ప్రారంభించనున్నారు. నాలుగేళ్ల సర్వీసును పూర్తిచేసుకున్నవాళ్లు సైన్యంలో కొనసాగాలంటే అవకాశం కల్పిస్తారు..

# వజ్రాల వేట షురూ....



కర్నూలు, జూన్ 18, అక్కడ తొలకరి చినుకు పడిందంటే అందరి చూపు అటువైపే పడుతుంది. ఈసారైనా అదృష్టం వరించకపోతుందా.? అని వేలాది మంది ఆశతో పత్తికొండ బాట పడుతారు. వజ్రాల వేటలో తలమునకలు అవుతారు. ప్రతీ ఏటా మొదలైన ఈసారి కూడా వజ్రాల వేట మొదలైంది. తొలకరి చినుకులు రావడంతో పత్తికొండ పొలాల్లో అన్వేషణ మొదలుపెట్టారు.రాయలసీమ జిల్లాల్లో కృష్ణదేవరాయల కాలంలో రత్నాలు వజ్రాలు బంగారు ఆభరణాలు రాసులుగా పోసి అమ్మేవారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఎడ్ల బండ్లలో తరలించే వారు. ఆ సమయంలో అక్కడక్కడా పడిపోయినవే నేడు బయటకు వస్తున్న వజ్రాలు అని కొందరు భావిస్తారు. అలాగే భూమి పొరలలో అనేక మార్పులు జరుగుతూ భయంకరమైన వేడికి భూమి లోపల నుంచి వచ్చిన వజ్రాలు, వర్షాలకు బయట పడుతున్నాయని మరి కొందరి వాదన. వాస్తవం ఏదైనా పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం జొన్నగిరి పగిడిరాయి, ఎర్రగుడి, బసినేపల్లి, కొత్తూరు, చెన్నంపల్లి చెరువు తండ తదితర గ్రామాలలో వజ్రాల అన్వేషణ పెద్ద ఎత్తున జరుగుతోంది. గతంలో ఒక క్యారెట్ నుంచి ముప్పై క్యారెట్ల వజ్రాలు చాలా మందికి దొరికాయి. కూలీలు సైతం రాత్రికి రాత్రే లక్షాధికారులుగా మారిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతాలలో పొలాల లోని చిన్న చిన్న రాళ్లు మెరుస్తూ ఉండటం వజ్రాలను పోలి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆ రాళ్ల నుంచి కొన్ని నిజమైన వజ్రాలు వర్షాలకు ఉబికి వస్తున్నాయి. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా వజ్రాల అన్వేషణ కోసం వేలాదిమంది ఈ గ్రామాలలో వచ్చి వాలుతుంటారు.ఈ అన్వేషణలో చిన్నపాటి రంగురాళ్ల నుంచి వజ్రాల వరకు కొనేందుకు పెరవలి గుత్తి మద్దికేర తదితర ప్రాంతాలలో వజ్రాల వ్యాపారులు స్థావరం ఏర్పాటు చేశారు అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వజ్రాల వ్యాపారులు తమకు ఏజెంట్లను కూడా నియమించుకున్నారు. పలానా వారికి వజ్రం దొరికింది అని ప్రచారం జరిగితే చాలు వ్యాపారుల ఏజెంట్లు అక్కడికి వెళ్లి వాలి పోతారు. గత ఏడాది చిన్న జొన్నగిరి కి చెందిన ఓ వ్యక్తికి 30 క్యారెట్ల వజ్రం లభ్యమైంది దీనిని స్థానిక వ్యాపారులు రూ. 1.25 కోట్లకు కొనుగోలు చేశారు. అయితే బహిరంగ మార్కెట్లో దీని విలువ రూ. మూడు కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. ఇలా దొరికినప్పుడల్లా పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రచారం చూసి ఇతర జిల్లాలు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వజ్రాల అన్వేషణకు ఆశావహులు తరలివస్తున్నారు. గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారి చూస్తే ఇరువైపులా పొలాల్లో వేల మంది వజ్రాల అన్వేషణ కనిపిస్తారు. బైకులు కార్లు ఆటోలు లో తరలివస్తుంటారు. ఉదయం ఏడు గంటల నుంచే సాయంత్రం పొద్దుపోయేదాకా అన్వేషణ కొనసాగిస్తారు మధ్యాహ్నం భోజనం కూడా అక్కడే చేస్తారు. మహిళలు అయితే చంటి పిల్లలను తీసుకొని అన్వేషణ కోసం వస్తుంటారు.భగ్గుమంటున్న రైతులు..ప్రతి ఏటా జరిగే అన్వేషణకు ఈసారి భిన్నమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. బాధిత రైతులు ఒక్కసారిగా భగ్గుమంటున్నారు. తమ పొలాలలో వజ్రాల కోసం వచ్చే వారి పై దాడికి దిగుతున్నారు. బైకులు ధ్వంసం చేస్తున్నారు. పొలాలు పంటలు నాశనం చేస్తున్నారంటూ వాపోతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా తమ పొలాల వద్ద కర్రలతో కాపలాగా ఉంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు దారి పొడవునా హెచ్చరిక బోర్డులు రైతులే స్వయంగా సంఘంగా ఏర్పడి ఏర్పాటు చేసుకున్నారు. వజ్రాల వేట పేరుతో తమ పొలాల్లోకి దిగితే శిక్ష తప్పదు అని బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. వజ్రాల అన్వేషణకు వస్తున్న వారికి, రైతులకు మధ్య జరుగుతున్న ఘర్షణ పోలీసుల దృష్టికి కూడా వెళ్లింది. గతంలో కూడా పోలీసులకు రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. ఈసారి ఘర్షణ వాతావరణం నెలకొనడంతో తప్పకుండా స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులే స్వయంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకున్న విషయం వాస్తవమేనని తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇస్తున్నారు.

# మంగళగిరి కోసం పక్కా ప్లాన్

గుంటూరు, జూన్ 18, గుంటూరు జిల్లా మంగళగిరి. 2014 నుంచి మంగళగిరి రాష్ట్రంలో కీలక నియోజకవర్గంగా మారిపోయింది. సీఎం జగన్‌తోపాటు విపక్షనేత చంద్రబాబు కూడా ఇదే నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారు. అందుకే మంగళగిరిపై పట్టుకోసం రెండు పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకెళ్తుంటాయి. 2019లో మంగళగిరి నుంచి నారా లోకేష్ పోటీ చెయ్యడంతో చాలా హైప్ వచ్చింది. ఆ ఎన్నికల్లో లోకేష్ ఓడిపోవడం.. ఆళ్ల రామకృష్ణారెడ్డి వరసగా గెలవడం పెద్ద చర్చకే దారితీసింది. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఇక్కడి నుంచే పోటీ చేస్తానంటున్నారు లోకేష్. ఈక్రమంలో మంగళగిరిలో మరింత పట్టు బిగించేందుకు వైసీపీ వేస్తున్న ఎత్తుగడలు రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి. ఆ వ్యూహం చుట్టూనే చర్చ సాగుతోంది.మంగళగిరిలో పద్మశాలీ సామాజికవర్గం ఓటర్లు సుమారు 50వేల వరకూ ఉన్నారు. వీరంతా ఎటు మొగ్గు చూపితే వారికే గెలుపు అవకాశాలు ఎక్కువ. గత రెండు ఎన్నికల్లో గెలిచిన ఆర్కేకు మంగళగిరి టౌన్ మైనస్ అయ్యింది. రెండుసార్లూ ఆయనకు మెజారిటీ రాలేదు. తాడేపల్లి మండలంలో రెడ్డి సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉ ండడంతో.. మంగళగిరి టౌన్‌లో ఎదురైన మైనస్‌ను అలా భర్తీ చేసుకుంటూ వచ్చారు. ఈసారి వైసీపీ ప్లాన్ మార్చిందని టాక్. మంగళగిరిలో ఉన్న బీసీ నేతలందరినీ క్యాప్చర్ చెయ్యాలని మాస్టర్ ప్లాన్ వేసింది. అందులో భాగంగానే పద్మశాలీ నేతగా ఉన్న చిల్లపల్లి మోహన్‌రావుకు ఆప్కో ఛైర్మన్ పదవి కట్టబెట్టింది. తెలుగుదేశానికి రాజీనామా చేసిన వైసీపీలో చేరకముందే మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది వైసీపీ. మంగళగిరి పట్టణ అధ్యక్ష పదవి కూడా చేనేత సామాజికవర్గానికి చెందిన మునగాల మల్లేశ్వరావుకు ఇచ్చారు. ఆయన భార్య భాగ్యలక్ష్మిని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి వరించింది. మంగళగిరి యార్డు చరిత్రలో ఇప్పటివరకూ చేనేతలకు ఛైర్మన్ పదవి ఇవ్వలేదు. మొదటిసారిగా ఆ పదవిని చేనేతలకు కట్టబెట్టి ఆ సామాజికవర్గాన్ని ఆకర్షించే ఎత్తుగడ వేసింది.ఇంతటితో ఆగకుండా చేనేత సామాజికవర్గం ఓటర్లను పూర్తిస్థాయిలో తమవైపు తిప్పుకునేందుకు మరిన్ని పదవులు ఇవ్వాలని భావిస్తున్నట్లు మంగళగిరిలో ప్రచారం జరుగుతుంది. మంగళగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత

కాండ్రు కమలకు కీలక పదవి ఇవ్వబోతున్నారట. తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు కమలను మేయర్‌ను చేస్తారని అనుకుంటున్నారు. కమల బరిలో ఉంటే గెలుపు ఈజీ అనే లెక్కలు వేస్తున్నారట. మురుగుడు హనుమంతరావుకు కాండ్రు కమల వియ్యపురాలు. హనుమంతరావు గతంలో మంగళగిరి మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాండ్రు కమల కూడా మంగళగిరి మున్సిపల్ ఛైర్మన్, మంగళగిరి ఎమ్మెల్యేగా పనిచేశారు. చేనేత సామాజికవర్గానికి చెందిన ఇద్దరు నేతలకు ఆ సామాజికవర్గంలో మంచి పట్టుంది. అందుకే ఇద్దరికీ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆ సామాజికవర్గం మొత్తం వైసీపీకి అండగా ఉంటుందనేది అధిష్టానం ఆలోచన. అంతేకాదు ఎన్నికల సమయానికి టీడీపీలో ఉన్న చేనేత సామాజికవర్గానికి చెందిన కీలక నేతను కూడా వైసీపీలోకి తీసుకొచ్చే ప్రయత్నాల్లో వైసీపీ నేతలు బిజీగా ఉ న్నారట. మరి.. ఈ వ్యూహం అధికారపార్టీకి ఏ మేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.

# ఆదిరెడ్డి భవానీకి..ఇంటి పోరు

రాజమండ్రి, జూన్ 18, ఏపీలో రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గాల్లో రాజమండ్రి ఒకటి. ఇక్కడి రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా ఉండటమే దానికి కారణం. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్లు గడువు ఉన్నా.. ఇప్పటి నుంచి పావులు కదుపుతున్న నేతలు ఎక్కువే. ప్రస్తుతం రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యేగా టీడీపీకి చెందిన ఆదిరెడ్డి భవానీ ఉన్నారు. ఆమె దివంగత టీడీపీ నేత ఎర్రన్నాయుడు కుమార్తె. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కోడలు. 2019 ఎన్నికల్లో వైసీపీ గాలిలో రాజమండ్రి అర్బన్, రూరల్ ఓటర్లు టీడీపీకే పట్టం కట్టారు. అర్బన్‌లో భవాని నెగ్గితే.. రూరల్‌లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి గెలిచారు. దీంతో మూడేళ్లుగా ఇక్కడి రాజకీయాలు ఆసక్తిగా ఉంటున్నాయి. ఇంతలో అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని చేసిన ప్రకటన సంచలనంగా మారింది.ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ నుంచి తన భర్త శ్రీనివాసు పోటీ చేస్తారని చెప్పారు ఎమ్మెల్యే భవాని. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి లేదన్నది ఆమె మాట. వాస్తవానికి 2019లోనూ చివరి నిమిషంలో తనను టీడీపీ అధిష్ఠానం పోటీ చేయిందనీ చెప్పుకొచ్చిన ఆమె.. వచ్చే ఎన్నికల్లో మాత్రం ఆదిరెడ్డి శ్రీనివాస్ తనకంటే భారీ మెజారిటీతో గెలుస్తారని వెల్లడించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వాసుయేనని చెప్పడంపై కేడర్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తోందట. అధిష్ఠానం నుంచి వచ్చిన సంకేతాల ఆధారంగా ప్రకటన చేశారా? లేక సొంత స్టేట్‌మెంటా అనేది చర్చగా మారింది.వాస్తవానికి ఆదిరెడ్డి కుటుంబంలో శ్రీనివాస్ మినహా మిగిలిన కుటుంబ సభ్యులంతా రాజకీయంగా పదవులు అనుభవించినవాళ్లే. వాసు తండ్రి అప్పారావు ఎమ్మెల్సీగా, తల్లి వీరరాఘవమ్మ రాజమండ్రి మేయర్‌గా పనిచేశారు. వాసు భార్య భవాని ఎమ్మెల్యే. 2019లో వాసునే టీడీపీ టికెట్‌పై పోటీ చేయాల్సి ఉంది. కానీ.. భవానీకి టికెట్ ఇచ్చింది పార్టీ. అందుకే వచ్చే ఎన్నికల్లో వాసును బరిలో దించి ఎమ్మెల్యేగా చేయాలని ఆదిరెడ్డి కుటుంబం గట్టిగా ప్రయత్నాలు చేస్తోందట.రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈసారి అర్బన్ నుంచి పోటీ చేయాలని అనుకుంటున్నారట. ఆయన ఇప్పటికే కర్చీఫ్ వేసుకుని కూర్చున్నారు. పైగా ఆదిరెడ్డి కుటుంబంతో ఆయనకు పడటం లేదు. రాజమండ్రి రూరల్ నుంచి రెండుసార్లు. రాజమండ్రి అర్బన్ నుంచి నాలుగుసార్లు గెలిచారు బుచ్చయ్య చౌదరి. సిటీని వదిలేసి తప్పు చేశానన్న ఫీలింగ్‌లో ఆయన ఉ న్నారట. పైగా అర్బన్‌లో అనుచరగణం ఉండటంతో రాజమండ్రిపై గట్టి ఆశలే పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయం గ్రహించే భవాని ముందుగానే ప్రకటన చేశారా? అనేది డౌట్.ఆ మధ్య ఆదిరెడ్డి శ్రీనివాసు రాజమండ్రి లోక్‌సభకు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ.. ఆయన మాత్రం అసెంబ్లీకే బరిలో ఉంటానని అనుచరులకు చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో రాజమండ్రిలో పట్టు నిలుపుకొనేందుకు ఆదిరెడ్డి కుటుంబం చేయని ప్రయత్నం లేదు. ఆదిరెడ్డి, గోరంట్ల వర్గాల మధ్య నిత్యం గొడవలు కామనైపోయాయి. ఇలాంటి తరుణంలో టీడీపీ అధిష్ఠానం ఏం చేస్తున్నది ప్రస్తుతం ఆసక్తి కలిగిస్తోంది.

# ఇక నో టీచర్ రిక్రూట్ మెంట్స్..?

విజయవాడ, జూన్ 18,ల్లలు చదువు విషయంలో ఈ మధ్య కాలంలో ఎన్నోరకాల మార్పులు వచ్చాయి. వాటిలో విద్యతో పాటు పిల్లలలో మానసిక ఎదుగుదలకు, సచ్ఛీలతకు దోహదపడేవి ఎన్నంటే జవాబు మాత్రం వెంటనే దొరకదు. గతంలో వలె స్కూలు కాగానే పుస్తకాలు పట్టుకుని అలా ట్యూషన్‌కి పరిగెట్టనవసరం లేదు. ఈ రోజుల్లో పిల్లలకు అంతా ఆన్‌లైన్ బోధనా సౌకర్యం బాగా అందుబాటులోకి వచ్చేసింది. స్కూల్ అయిపోగానే ట్యాబ్ ల ముందో, స్మార్ట్ ఫోన్లు చేపబట్టుకునో పిల్లలకు పాఠాలు చెప్పేసే యాప్ లు అందుబాటులోకి వచ్చేశాయి.కొత్తొక వింత అన్నట్లు ఇవి పిల్లలో విద్య పట్ల ఆసక్తి అభిరుచి పెంచేస్తాయని తల్లిదండ్రులూ నమ్మేస్తున్నారు. కాదు కాదు నమ్మేలా అడ్వర్టైజ్ మెంట్లతో యెడ్యూ టెక్ యాప్ లు ఊదరగొట్టేస్తున్నాయి. ఇప్పుడు ఏపీ సర్కార్ కూడా వాటకి తోడైంది. నిజానికి ఈ ఎడ్యూటెక్ యాప్‌లపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థుల మానసిక స్థితిని దెబ్బతీస్తున్నాయని.. తప్పుడు ప్రకటనలు ఇస్తున్నాయని.. భారీగా డబ్బులు గుంజుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఇండియాలో ఇంకా పూర్తి స్థాయిలో వీటి విజృంభణ ప్రారంభం కాలేదు. బైజూస్ స్టార్టప్‌గా ప్రారంభించి కాస్త ఆదరణ పొందగానే పెట్టుబడులు సమీకరించి.. ఇతర ఎడ్యూటెక్ స్టార్టప్‌లను కొనుగోలు చేసి పోటీ లేకుండా చేసుకుంది. వాస్తవానికి ఇలాంటి ఎడ్యూటెక్ యాప్ ల వల్ల విద్యార్థుల మనుసులు కలుషితం అవుతాయనీ.. లాభార్జన వీటి లక్ష్యం తప్ప విద్యార్థుల భవిష్యత్ కాదనీ.. విద్యను వ్యాపారం చేసేస్తున్నాయన్న ఆరోపణలు కోకొల్లలు. ఇప్పటికే యెడ్యూటెక్ లు విద్యార్థుల మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయంటే చైనా వాటిని తమ దేశంలో నిషేధించింది. పలు దేశాలు అదే దారిలో ఉన్నాయి. అమెరికా వంటి దేశాలు సైతం యెడ్యూటెక్ యాప్ లపై పలు ఆంక్షలు విధించాయి. వాస్తవం ఇలా ఉండగా..జగన్ సర్కార్ మాత్రం విద్యా విధానంలో పెద్ద సంస్కరణగా అభివర్ణిస్తూ జగన్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ తరహా బోధనను అందించాలని సంకల్పించారు.దీని కోసం దేశంలోనే అతి పెద్ద యెడ్యుకేషన్ టెక్ కంపెనీగా గుర్తింపు పొందిన బైజూస్ లో జగన్ సర్కార్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించడానికి ఎంతో వీలుంటుందని జగన్ అంటుంటే.. రాష్ట్రంలో విద్యను మరింత నాశనం చేసే యత్నంగా విద్యారంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే జగన్ మాత్రం పిల్లలకు మంచి జరుగుతుంది, వారికి కాస్ట్‌లీ చదువులను అందజేస్తున్నా మంటూ వాదిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులను నమ్మించేందుకు ప్రయత్ని స్తున్నారు.నిజమే ఇది నిజంగా కాస్ట్లీ వ్యవహారమే. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ప్రభుత్వ పాఠశాలల్లో యెద్యూ టెక్ కు అవసరమైనన్ఫ్రాష్టర్చర్, ఒప్పందం మేరకు చెల్లింపులు కచ్చితంగా ప్రభుత్వానికి కాస్ట్లీయే. కానీ ఇక్కడ వ్యయం, ఖరీదు కాదు..అసలు వాస్తవంఇక ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల రిక్రూట్ మెంట్ అనేది లేకుండా చేయడమే జగన్ ఉద్దేశం అని పరిశీలకులు అంటున్నారు.

# ఏపీలో స్టూడియోలకు దూరంగా టాలీవుడ్

విశాఖపట్టణం, జూన్ 18, తెలుగు చిత్ర సీమకు,రాజకీయ చుట్టరికం కొత్త విషయం కాదు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్' లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగానే, చాలా మంది నటీ నటులు, రాజకీయ అరంగేట్రం చేశారు. పాత తరం హీరో కమ్ విలన్ కొంగర జగ్గయ్య మొదలు నట శేఖర కృష వరకు కాంగ్రెస్ టికెట్ మీద పోటీచేసి పార్లమెంట్' లో అడుగు పెట్టారు. అలాగే హీరోయిన్లలో జమున కూడా కాంగ్రెస్ ఎంపీగా లోక్ సభకు ఎన్నికయ్యారు. అలాగే, వాణిశ్రీ, వంటి ఇంకొందరు ప్రముఖ నటీనటులు చట్టసభల్లో కాలు పెట్టక పోయినా కాంగ్రెస్ పార్టీలో, అదే విధంగా కమ్యూనిస్ట్ పార్టీలలో క్రియాశీలక పాత్రను పోషించారు. ఎర్ర సినిమాలకు పెట్టింది పేరుగా నిలిచినా మాదాల రంగా రావు, కమ్యూనిస్ట్ రాజకీయాల్లో క్రియాశీల పాత్రను పోషించారు. అలాగే అల్లు రామలింగయ్య చివరి వరకు, సిపిఎం పార్టీకి ప్రతి సంవత్సరం 'సెస్' ( చందా) ఇచ్చేవారని అంటారు. ఇక, విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు, అన్న ఎన్టీ రామ రావు స్థాపించిన తెలుగు దేశం హయాంలో అయితే చెప్పనే అక్కరలేదు. ఆది సినిమా రాజకీయ అనుబంధానికి స్వర్ణ యుగం అని చెప్పవచ్చును. ఆ కాలంలో ఎందరో నటీనటులు, నిర్మాతలు, దర్శకులు ఒకరని కాదు 24 ఫ్రేమ్స్ కు చెందిన అనేక మంది సినిమా ప్రముఖులు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజకీయాలలో క్రియాశీల భూమికను పోషించారు. తెలుగు దేశం టికెట్ పైన, ఎంపీలు, ఎమ్మెల్యేలు అయ్యారు. బాబూ మోహన్ వంటి ఒకరిద్దరు మంత్రులుగానూ ఓ వెలుగు వెలిగారు.నిర్మాత రామానాయుడు, నటీ నటులు నందమూరి బాల కృష్ణ, హరికృష, మురళీ మోహన్, సత్యనారాయణ, రావు గోపాల రావు, బాబు మోహన్, కోట శ్రినివాస రావు, శారద, జయ ప్రద, జయ సుధ, కే . రోజా, ఇంకా అనేక మంది తెలుగు దేశం పార్టీ వేదిక నుంచే రాజకీయ అరంగేట్రం చేశారు. పార్టీలు మారినా ఇప్పటికీ కొందరు క్రియాశీలంగా, కీలక పదవుల్లో ఉ న్నారు. అలాగే రెబెల్ స్టార్ క్రిషన్ రాజ, కోట శ్రీనివాస రావు, నరేష్ వంటి చాలా మంది నటీనటులు బీజేపీలో క్రియాశీలంగా వ్యవహరించారు. కృష్ణం రాజు అయితే, వాజ్ పేయి ప్రభుత్వంలో కేంద్ర మత్రిగా పనిచేశారు. అదే విధంగా మెగా స్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ద్వారానూ కొందరు, నటీ నటులు సినీ ప్రముఖులు రాజకీయాలలో తమ అదృష్టాన్ని పరీక్షించు కున్నారు. అయితే, చిరంజీవి అతి తక్కువ కాలంలోనే ప్రజారాజ్యం దుకాణం మూసి వేయడం వల్లనో ఏమో తమ్ముడు, పవన్ కళ్యాణ్. పోసాని కృష్ణ మురళీ తప్పించి పెద్దగా సినిమా వాళ్ళు చిరంజీవితో చేయి కలపలేదు. కలిసి నడవలేదు. చివరకు తమ్ముడు పవన్ కళ్యాణ్' కూడా ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడాన్ని వ్యతిరేకించి,వేరు కుంపటి(జన సేన) పెట్టుకున్నారు. ఇక ప్రస్తుతానికి వస్తే, ఉభయ తెలుగు రాష్ట్రాలలో సినిమా వాళ్ళకు పొలిటికల్ ప్యాట్రనేజ్ పెద్దగా దక్కడం లేదు. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సినిమా వాళ్ళను కూరలో కరివేపాకులా వాడుకుని వదిలేస్తున్నారు. అంతే కానీ, వారికి సముచిత స్థానం ఇవ్వడం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్రను పోషించిన విజయ శాంతి మొదలు నిన్నమొన్న ఇట్లా దగ్గర చేసి అట్లా పక్కన పెట్టిన ప్రకాష్ రాజ్ వరకు ఎవరికీ కాసింత గౌరవం ఇచ్చింది లేదు. అందరి విషయంలోలానే సినిమా వాళ్ళ విషయంలోనూ కేసీఆర్, యూజ్ అండ్ త్రో' పద్ధతినే పాటించారని అంటారు. ఇక ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విషయం అయితే చెప్పనే అక్కరలేదు. నిజానికి, సినిమా హీరోలను జీరోలుగా చేసిన, 'ఘనత' జగన్ రెడ్డికే దక్కింది. సినిమా టికెట్ ధరల చుట్టూ వివాదాన్ని సృష్టించి, వివాదం పరిష్కారం విషయంలో ప్రభుత్వం అనుసరించిన విధానం సినిమా రంగం పట్ల జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న అభిప్రాయాన్ని చెప్పకనే చెప్పింది. అదే విధంగా రాజకీయ పదవుల విషయంలోనూ జగన్ రెడ్డి, చిరంజీవి మొదలు అలీ వరకు, మోహన్ బాబు మొదలు పోసాని కృష్ణ మురళీ, వరకు ప్రతి ఒక్కరితో ఒకే విధంగా ఆడుకున్నారనే టాక్ టాలీవుడ్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. ఇంతవరకు ఏవో ఆశలతో, వైసీపే కండువా కప్పుకుని, జగన్ రెడ్డిని నెత్తిన మోసిన, పెద్దల ఆశలు మంచులా కరిగి పోయాయని, ఇంకొందరేమో, జగన్ రెడ్డి ని మోసి నందువలన తమకు దక్కింది ఏమీ లేక పోగా సినిమాల్లోనూ అవకశాలు రావడం లేదని అ వాపోతున్నారు. అందుకే జగనన్నా నీకో దండం అంటున్నారు.రాష్ట్రంలోసినిమా పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలున్నా,సినిమారంగం అంటే ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి చిన్నచూపని, అర్థమయింది కాబట్టే, స్టుడియోల నిర్మాణానికి ఫ్రీ ల్యాండ్ సహా ఇతర సదుపాయాలు కలిపిస్తామని చెప్పినా, ఎవరూ ముందుకు రావడం లేదని, అంటున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో మోడీ మూడు రోజులు...

విజయవాడ, జూన్ 18, ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే నెల మొదటి వారంలో ఏకంగా మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాలలో పర్యటించనున్నారు. జులై 2, 3 తేదీలలో హైదరాబాద్ వేదికగా జరిగే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు హాజరౌతారు. ఆ మరునాడు అంటే జులై 4న ఏపీలో పర్యటించనున్నారు. మంగళగిరిలో ఆయన ఎయిమ్స్ ను ప్రారంభిస్తారు.ప్రధాని ఏకంగా మూడు రోజులు తెలుగు రాష్ట్రాలలోనే మకాం వేయనుండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు తెలంగాణను వేదిక చేసుకుంది. ఈ సమావేశాలకు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సహా పార్టీ అగ్రనేతలంతా హాజరు కానున్నారు. జాతీయ కార్యవర్గ సమావేశాల నిర్వహణతో తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపి తెలంగాణలో కమల వికాసం దిశగా వారిని కార్యోన్ముఖలను చేయడానికి అవసరమైన దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. ఇక ఏపీలో కూడా బీజేపీ బలోపేతం కోసం సర్వశక్తులూ ఒడ్డుతోంది. సొంతంగా బలం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. అందులో భాగంగానే రాష్ట్రంలో ఏ పార్టీనీ, ఏ వ్యక్తినీ పార్టీ భుజాన మోయదంటూ బీజేపీ జనసేనకు స్పష్టత నిచ్చింది. మోడీ రాష్ట్రపర్యటనకు ప్రాధాన్యత వచ్చింది. ఏపీ గడ్డపై నుంచి రాష్ట్ర బీజేపీ సేనలకు ఆయన ఏం చెబుతారన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన ఉంది. అయితే పర్యాటకులు మాత్రం రాష్ట్రపతి ఎన్నికలో బీజేపి అభ్యర్థికి వైసీపీ మద్దతు ఇవ్వడం ఖరారైనప్పటికీ, మరో సారి అదే విషయమై జగన్ తో చర్చించే అవకాశాలు మెండుగా ఉన్నాయని భావిస్తున్నారు. మొత్తం మీద దక్షిణాదిలో బలోపేతం



కావాలన్న బీజేపీ యత్నాలకు అనుగుణంగానే ప్రధాని, హోంమంత్రి సహా కమలం పార్టీ నే తలు ఒక్కరొక్కరుగా తెలుగు రాష్ట్రాలకు క్యూ కడుతున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగానే మోడీ వరుసగా మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాలలో పర్యటన ఉండేలా షెడ్యూల్ ఖరారు చేసుకున్నారని అంటున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన తెలంగాణలో రెండు రోజులు మకాం వేయనున్నారు. ఆ సందర్భంగా తెలంగాణలో పార్టీ బూత్ స్థాయిలో బలోపేతం అయ్యేలా క్యాడర్ కు దిశా నిర్దేశం చేయడంతో పాటు ఏపీకి చెందిన పార్టీ ముఖ్య నేతలతో కూడా ఆయన చర్చించే అవకాశం ఉంది. ఏపీలో కూడా ముందస్తు అంచనాల నేపథ్యలో పార్టీ క్యాడర్ ను ఎన్నికలకు సన్నద్ధం చేయడంతో పాటు.. పార్టీకి నష్టం వాటిల్లకుండా, పొత్తుపొడుపుల విషయంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని కూడా ఖరారు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.ఎవరెన్ని చెబుతున్నా ఏపీలో బీజేపీకి వైసీపీకి మైత్రి బహిరంగ రహస్యమే. ఆ కారణంగానే తన మిత్రుడికి మేలు కలిగేలా రాష్ట్రంలో విపక్షాల ఐక్యతకు గండి కొట్టేలా రాష్ట్రంలో కమలం నాయకత్వం వ్యవహరిస్తున్నది. వైసీపీ బలం పెచ్చు చేసి చూపుకునేందుకు వీలుగా ఆత్మకూరు ఉప ఎన్నికలో అభ్యర్థిని పోటీకి నిలిపిందని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో మోడీ ఏపీ పర్యటన సందర్భంగా అధికార పార్టీపై విమర్శల మరకలు కాకుండా ప్రశంసల మెరుపులు ఉండే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.రాష్ట్రపతి ఎన్నికలో వైసీపీ మద్దతుకు సంబంధించిన మంతనాలకే మోడీ ఏపీ పర్యటన పరిమితమయ్యే అవకాశాలే మెండుగా ఉన్నాయంటేన్నారు. నిన్న గాక మొన్న ఏపీ ముఖ్యమంత్రి జగన్ హస్తినలో పర్యటించి ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఆ భేటీ వివరాలు బయటకు రాకపోయినప్పటికీ.. ఇరువురి మధ్యా చర్చ ప్రధానంగా రాష్ట్రపతి ఎన్నికలో వైసీపీ బీజేపీకి మద్దతు ఇవ్వడంపైనే జరిగిందని ఇరు పార్టీల నాయకులూ కూడా ప్రైవేటు సంభాషణల్లో చెబుతున్నారు.అంతకు మించి ఏపీకి రావలసిన ప్రత్యేక హోదా, రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ వంటి డిమాండ్లేవీ జగన్ మోడీ ఎదుట ఉంచలేదని కూడా అంటున్నారు. అయితే రాష్ట్రంలో షో రన్ చేయడానికి, ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కడానికి మరింత అప్పు మంజూరు చేయాలని జగన్ ప్రధానిని కోరారనీ, అందుకు మోడీ సానుకూల స్పందన ఫలితమే.. మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టుకుని రుణం పొందేందుకు ఆర్బీఐ అంగీకరించడమని చెబుతున్నారు. అదనపు రుణాన్ని అందించినందుకు మోడీకి జగన్ కృతజ్ఞతలు తెలపడం వినా మోడీ రాష్ట్ర పర్యటన వల్ల ఒరిగేది, ఒనగూడేదీ ఏమీ ఉండదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## వకుళమాత.. మహాసంప్రోక్షణ

తిరుమల, జూన్ 18, యశోదాదేవి కలియుగంలో వకుళామాతలా మారి స్వామివారి ఆలనాపాలనా చూసిన వకుళామాత పద్మావతి దేవిని ఇచ్చి స్వయంగా వివాహం చేసింది. తన కోరికను నెరవేర్చుకుంది. శ్రీవారి తల్లిగా పూజలను అందుకున్న వకుళాదేవి ఆలయం తిరుపతి సమీపంలోని పాత కాల్వ వద్ద పేరూరు బండపై ఉంది. గత కొన్ని సంవత్సరాలకు ముందు వకుళామాత ఆలయంలో గంట కొట్టిన తర్వాతనే శ్రీవారికి నైవేథ్యం పెట్టేవారని ప్రసిద్ధి. శిధిలావస్థలో ఉన్న దేవాలయం స్థానంలో ఇప్పుడు వకుళమాత ఆలయాన్ని నిర్మించారు. ఈ నూతన వకుళమాత ఆలయ మహాసంప్రోక్షణ 23వ తేదీ వరకు జరుగనున్నాయి. జూన్ 23వ తేదీన ఉదయం 7.30 నుండి 8.45 గంటల వరకు విగ్రహప్రతిష్ట, మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు.జూన్ 19న ఉదయం 6.30 నుండి 11 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, అకల్మషహోమం, అక్షిమోచనం, పంచగవ్యాధివాసం చేపడతారు. సాయంత్రం 6.30 గంటలకు అగ్నిప్రతిష్ట, కలశస్థాపన, కుంభావాహనం, కుంభారాధన, ఉక్త హోమాలు నిర్వహిస్తారు.జూన్ 20న ఉదయం 8.30 గంటలకు కుంభారాధన, ఉక్త హోమాలు, నవ కలశ స్నపన క్షీరాధివాసం, సాయంత్రం 6.30 గంటలకు హోమాలు, యాగశాల వైదిక కార్యక్రమాలు చేపడతారు.జూన్ 21న ఉదయం 8.30 గంటలకు పుణ్యాహవచనం, కుంభారాధన, చతుర్ధశ కలశ స్నపన జలాధివాసం, సాయంత్రం 6.30 గంటల నుండి హోమం, యాగశాల కార్యక్రమాలు నిర్వహిస్తారు.జూన్ 22న ఉదయం 8 గంటలకు రత్నధాతు అధివాసం, కుంభారాధన, హోమాలు, ఉదయం 10.45 నుండి 11.30 గంటల వరకు విమాన కలశ స్థాపన, గోపుర కలశ స్థాపన, రత్నన్యాసం, ధాతున్యాసం, విగ్రహ స్థాపన, మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుండి 6.30 గంటల వరకు మహాశాంతి తిరుమంజనం, రాత్రి 8 గంటలకు కుంభారాధనం, నివేదన, శయనాధివాసం, విశేష హోమాలు, యాగశాల కార్యక్రమాలు చేపడతారు. జూన్ 23న ఉదయం 4.30 నుండి 7 గంటల వరకు కుంభారాధన, నివేదన, హోమం, మహాపూర్ణాహుతి, విమాన గోపుర కలశ ఆవాహన, ఉదయం 7.30 నుండి 8.30 గంటల వరకు మిథున లగ్నంలో ప్రాణ ప్రతిష్ట, మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు. ఆ తరువాత అక్షతారోహణం, అర్చక బహుమానం అందిస్తారు. ఉదయం 10.20 గంటలకు ధ్వజారోహణం, ఉదయం 10.30 నుండి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 3.30 నుండి 4.30 గంటల వరకు శాంతి కల్యాణోత్సవం జరుగనుంది. అనంతరం ధ్వజావరోహణం చేపడతారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 9 గంటల వరకు సర్వదర్శనం కల్పిస్తారు.పేరూరు కొండపై ఉన్న వకుళామాత ఆలయంలోని పెద్ద గంట కొడితే తిరుమల గిరులపై ఆ గంట వినబడేది. అలా ఎంతో చారిత్రక కట్టడం వకుళామాత ఆలయం.

## మంథని మున్సిపల్ సిబ్బందిని సన్మానించిన చైర్మన్ పుట్ట శైలజ

మంథని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి 4వ విడత కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ కార్మికులు విభాగం నుండి రాజయ్య, భూదేవి, మల్లేష్, వాటర్ సప్లై విభాగం నుండి ఉప్పల్ రెడ్డి, రాజమల్లు, వీధిలైట్ల విభాగం నుండి బూడిద సమ్మయ్య, హరితహారం విభాగం నుండి రాకేష్ లను మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పట్టణ ప్రగతి స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్ మేరాజ్ మహుమూద్ ను మున్సిపల్ చైర్మన్ సహా సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్ విజయలక్ష్మి- పాపారావు, నక్క నాగేంద్ర - శంకర్, వీకే. రవి, కో - ఆప్షన్ సభ్యులు సముద్రాల స్వాతి - శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ యూ.శారద , వార్డు ఇంఛార్జీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక త్రవ్వకాలతో పొలాలకు వెళ్ళే దారులు మాయం





అర్ధరాత్రి సమయంలో నడుస్తున్న ఇసుక దందా

పట్టించుకోని పోలీసు అధికారులు

వంకలలో ఇసుక తవ్వడంతో భారీ గుంతలు ఏర్పడి,వర్షం నీటి తాకిడికి కొట్టుకుపోయిన ఎద్దుల బండి

రైతుల అప్రమత్తతో త్రుటిలో తప్పిన ప్రమాదం

సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్న మారెళ్ళ గ్రామ రైతులు

తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల,మారెళ్ళ గ్రామాల పరిధిలో భారీ వర్షాలు కురవడం వలన నీరు ప్రవహించి ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక వంకలలో లభ్యమవుతుంది.ఈ గ్రామాల పరిధిలోని వంకలలో భారీగా ఇసుక దందా జరుగుతుందని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.అర్ధ రాత్రి సమయంలో వంకలలో ఎక్కడ పడితే అక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.ఇంత యథేచ్ఛగా ఇసుక దందాలను నిర్వహిస్తున్నా పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.శనివారం అర్ధ రాత్రి కురిసిన భారీ వర్షానికి మారెళ్ళ గ్రామ పరిధిలోని వంకలన్ని నీటి ఉధృతితో ప్రవహిస్తున్నాయి. మారెళ్ళ గ్రామంలో జాగిరి రస్తా వద్ద ఉన్న పెండేకల్ వంకలో కొందరు వ్యక్తులు ఆరు నుండి ఏడు అడుగుల లోతు ఇసుక త్రవ్వకాలను చేపట్టారని,పొలాలకు వెళ్లే దారులలో కూడా భారీగా ఇసుక తవ్వకాలను చేపట్టారని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నాను.శనివారం ఉదయం ఎద్దుల బండితో రైతు వంక దాటుతుండగా తవ్వకాలు చేపట్టిన గుంతలో ఎద్దుల బండి పడి కొట్టుకుని పోయిందని గ్రామ ప్రజలకు తెలియజేశారు.రైతుల అప్రమత్తతో రెండు మూగజీవాలు బయటపడ్డాయని, రైతుకు స్వల్పంగా గాయాలయ్యాయని వారు తెలియజేశారు.లేకుంటే చాలా వరకూ ప్రాణనష్టం జరిగేదని వారు తెలియజేశారు. సుమారు మూడు వేల ఎకరాలకు పైగా ఈ వంక ను దాటుకునే రైతులు పొలాలకు వెళ్లాలని, అటువంటి దారులలో అర్ధరాత్రి సమయంలో ఇసుక తవ్వకాలు చేపట్టడం ద్వారా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలను కట్టడి చేసి రైతుల గురించి ఆలోచించాలని గ్రామ రైతులు తెలియజేశారు. అక్రమ ఇసుక తవ్వకాల వలన రైతులకు మరియు మూగజీవాలకు ఎటువంటి నష్టం వాటిల్లిన దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని గ్రామ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై నియోజకవర్గ ఎమ్మెల్యే దృష్టి సాధించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

## కంచికచర్లలో ఉద్రిక్తత

నందిగామ ఎన్టీఆర్ జిల్లా నందిగామ కంచికచర్ల లో రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేసిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను పరామర్శించేందుకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పి మధు, వైవి ఇతర నాయకులు వచ్చారు. అయితే వారిని పోలీసులు లోనికి అనుమతించలేదు. పోలీసుల తీరును నిరశిస్తూ ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు పి మధు, వైవి ఇతర నాయకులను బలవంతంగా ఎత్తి వ్యానులోకి ఎక్కించారు. పోలీసుల తీరుపై మధు తదితరులు విరుచుకపడ్డారు. అదుపులోకి తీసుకున్న పి మధు , వైవి ఇతర నాయకులను వీరులపాడు పోలీస్ స్టేషన్ కు తరలించారు. కంచికచర్ల లో రూరల్ సర్కిల్ కార్యాలయంలో సిహెచ్ బాబూరావు, మాల్యాద్రి, ఇతర నాయకులు నిరసనకు దిగారు.

## ఏయూ ఉద్యోగుల జెఏసి నిరసన...

విశాఖ టిడిపి మాజీ మంత్రి అయ్యన్నపా త్రుడు ఆంధ్రా యూనివర్సిటీ ని, యూనివర్సిటీ అభివృద్ధిని ఉద్దేశించి అసభ్య పదాలతో అవమాన పరిచిన ట్లు గా ట్విట్టర్లో పోస్ట్ చేయడాన్ని ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు పై చట్టపరమైన చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద రాస్తారోకో నిర్వహించా రు. అనంతరం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు దిష్టిబొమ్మ దగ్ధం ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు ఆంధ్రా యూనివర్సిటీ భూముల పైన, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పైన, అలాగే యూనివర్సిటీలో కండోమ్ లు అని ప్రచారం చేస్తూ ట్విట్టర్ లో పోస్టింగులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. ఎంతోమంది మేధావులు చదువుకున్న ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర అయ్యన్నపాత్రుడు కి తెలుసా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాల యాన్ని అభివృద్ధి చేస్తున్న తరుణంలో సభ్య సమాజం సిగ్గుపడే విధంగా అయ్యన్నపాత్రుడు పోస్టింగ్లు చేయడం సిగ్గుచేటన్నారు.దీనివలన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని, యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులను, యూనివర్సిటీ లో పనిచేస్తున్న ఉద్యోగులను, అలాగే ప్రపంచవ్యాప్తంగా యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులను అవమాన పరిచినట్లు గా భావిస్తున్నామన్నారు. తక్షణమే అయ్యన్నపాత్రుడు ఆంధ్ర యూనివర్సిటీ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## నిజానిజాలు తెలుసుకొని వ్రాయండి

సర్పంచ్ దినకర్

ఆధారాలు ఉంటే మాకు చూపించాలి

:ఎంపిడిఓ జగన్మోహన్ రెడ్డి

కౌతాళం నిజానిజాలు తెలుసుకొని వ్రాయాలని నోటి మాటలు లేదా వారి ఆధారాలు ఉంటే మాకు చూపించలని సర్పంచ్ పాల్ దినకర్ ,ఎంపిడిఓ పేర్కొన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో అక్రమ వసూళ్లు దందా అనే న్యూస్ కథనం పై ఎవరైనా సిబ్బంది తప్పు చేసి ఉంటే వాటి ఆధారాలను బట్టి వారిపై పై అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇంటి పరిమిషన్ కు 8000 వేలు నిజమేనని ఆన్లైన్ లో కంప్యూటర్ లో బ్లూ ప్రింట్ తిస్తున్నామని ,తెలిపారు.చెక్ బందీ 5 వేలు డెత్, బర్త్ కు 1000 అనడం అవస్తావాలు అని వాటి ఆధారలు మాకు చూపించాలని నిజానిజాలు తెలుసుకుని వ్రాయాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆధారాలు ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఇన్ ఛార్జ్ నవీన్ కుమార్ ఉపసర్పంచ్ తిప్పయ్య, కార్యకర్త రామకృష్ణ ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవగాహన పెంచుకోవాలి

మొబైల్ ఫోన్ లలో అవసరమైన యాప్ లనే వినియోగించాలి

సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలి

"ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" లో భాగంగా సైబర్ సేఫ్టీ అండ్ నేషనల్ సేఫ్టీ అనే అంశంపై అవగాహనా సదస్సు

కడప జూన్ 18 సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్ లో ఇంటర్ నెట్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" లో భాగంగా "సైబర్ సేఫ్టీ అండ్ నేషనల్ సేఫ్టీ" అనే అంశంపై అవగాహన సదస్సులో జిల్లా ఎస్.పి శ్రీ కే.కే.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ గారు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ దైనందిన జీవితంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ అంతర్భాగంగా మారిందని ఎస్.పి గారు తెలిపారు. 1ఉ నుండి ప్రస్తుతం అత్యాధునిక 5ఉ సాంకేతిక పరిజ్ఞానం తో మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నామని, వాయిస్ కమాండ్ ద్వారా ఇంట్లోని ఫ్రిడ్జ్, ఏ.సి లను నియంత్రించే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని జిల్లా ఎస్.పి తెలిపారు. కమ్యూనికేషన్ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరిగిందన్నారు. మొబైల్ ఫోన్ లో కానీ, ల్యాప్ టాప్ లో కానీ ఆపరేటింగ్ సిస్టం (ూా) కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మొబైల్ ఫోన్ మన దైనందిన జీవితంలోని ప్రతి చర్యను గమనిస్తూ ఉంటుందని, ఎప్పటికప్పుడు మనతో ఇంటరాక్షన్ లో ఉంటుందన్నారు. ఏదైనా యాప్ ను డౌన్ లోడ్ చేసుకున్నప్పుడు జాగ్రత్తగా అనుమతులు ఇవ్వాలని, ఫోటో, లొకేషన్, కాంటాక్ట్స్ తదితర అనుమతులు యాప్ కు ఇచ్చేటపుడు ఒకటికి రెండు సార్లు అలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనవసరంగా పర్మిషన్స్ ఇచ్చి మీ వ్యక్తిగత గోప్యత(ప్రైవసీ) యాప్ నిర్వాహకుల చేతుల్లోకి వెళ్లి చిక్కుల్లో పడవద్దని సూచించారు. ఫోటోలను మొబైల్ లో కాకుండా ఇంటర్ నెట్ సౌకర్యం లేని మరో డివైస్ లో స్టోర్ చేసుకోవడం సురక్షితంగా ఉంటుందన్నారు. అనుకోని పరిస్థితుల్లో ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే తక్షణం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఔ.అ.ఖీ.ఖ) లో నమోదు చేయాలని, వెంటనే సంబంధిత పోలీసు అధికారులు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. సోషల్ మీడియా లో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, బాధ పెట్టినా, అవమానించినట్లు భావించినా వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎస్.పి శ్రీ కే.కే.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ సూచించారు. సాంకేతికత పెరిగే కొద్దీ సైబర్ నేరాలు పెరిగే ప్రమాదం పొంచి ఉందని గుర్తుంచుకుని, అప్రమత్తంగా ఉన్నపుడే సురక్షితంగా ఉండే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ కు సంబంధించి జిల్లాలో ఈ ఏడాది 902 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. అదనపు ఎస్.పి (పరిపాలన) పూజిత నీలం మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో స్మార్ట్ ఫోన్ లు, కంప్యూటర్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో ఈ-బ్యాంకింగ్ లేదా ఆన్ లైన్ లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ఐదేళ్లలో డేటా వినియోగదారులు అధికమయ్యారని, ఆన్ లైన్ లావాదేవీలు సురక్షితంగా చేసేందుకు వీలుగా పలు సూచనలు చేశారు. ఏ.ఆర్ అదనపు ఎస్.పి మహేష్ కుమార్ మాట్లాడుతూ ఈ-వ్యాలెట్ లైన ఫోన్ పే, గూగుల్ పే, పే పాల్ లాంటి యాప్ ల ద్వారా ఆన్ లైన్ లావాదేవీలు అధికంగా జరుగుతుంటాయని అపరిచిత వ్యక్తులు, ఖాతాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. లాటరీ లు, లక్కీ డ్రా లు అంటూ నిత్యం మోసాలు జరుగుతున్నాయని, మభ్యపెట్టే మాటలకు అత్యాశకు పోయి మోసపోవద్దని సూచించారు. ఓ.టి.పి నేరాలు అధికంగా జరుగుతున్నాయని, మీకు ఫోన్ చేసి ఫలానా బ్యాంకు నుండి మాట్లాడుతున్నామని చెబుతూ ఓ.టి.పి చెప్పాలని అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదని, ఏ బ్యాంకు కూడా ఓ.టి.పి చెప్పమని అడగదన్నారు. ఆన్ లైన్ లావాదేవీలు నిర్వహించుకునేందుకు స్ట్రాంగ్ పాస్ వర్డ్ ను పెట్టుకోవాలని, ఇందులో అంకెలు, అక్షరాలు, స్పెషల్ క్యారక్టర్ లు పాస్ వర్డ్ లో ఉండేలా చూసుకోవాలని సూచించారువై.వి.యు ప్రొఫెసర్ సి నాగరాజు మాట్లాడుతూ సగానికన్నా తక్కువకే మొబైల్ ఫోన్ లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, లేదా ఇతరత్రా వస్తువులు ఇస్తున్నామంటూ ఆన్ లైన్ లో వచ్చే ఆకర్షణీయమైన పోస్టులను నమ్మి మోసపోకూడదన్నారు. మొబైల్ ఫోన్ కు వచ్చే లింకులను క్లిక్ చేసి వారి మాయమాటలు నమ్మితే ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుందన్నారు.

## భద్రతను పరిశీలించిన సీపీ శ్రీకాంత్

విశాఖపట్నం దేశ వ్యాప్తంగా అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా అల్లర్లు రేగుతున్న నేపథ్యంలో విశాఖలో పోలీసులు అలెర్టు అయ్యారు.ఎక్కడా ఆందోళనకారులు చెలరేగకుండా ఉండేలా నగరంలో పతిష్టమైన చర్యలు చేపట్టారు.సంఘ విద్రోహులు రైల్వే స్టేషన్లను టార్గెట్ చేస్తున్నా తరుణంలో విశాఖ స్టేషన్లో బద్రతను కట్టుదిట్టం చేశారు.పూర్తి పోలీస్ బందో బస్తుతో విశాఖ రైల్వే స్టేషన్ కొనసాగుతున్న బందోబస్తును పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ పరిశీలించారు.రైల్వే ఆస్తులు, కేంద్ర ప్రభుత్వం ఆస్తులకు ప్రత్యేక భద్రతకు కల్పిస్తున్నామని,ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు వద్ద ప్రత్యేక నిఘాగా పెట్టామని వివరించారు.రిక్రూటింగ్ అధికారులు, డిఫెన్స్ అకాడమీ వాళ్ళతో ఇప్పటికే సంప్రదించామన్నారు.

## చంద్రబాబును మీడియా కాపాడుతోంది

గుంటూరుగుంటూరు జిల్లా పొన్నూరులో సాక్షి భావనారాయణ స్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొన్నారు. లక్ష్మీపార్వతి మాట్లాడుతూ నారా లోకేష్ ,పవన్ కళ్యాణ్ పాదయాత్రపై పిల్లి మెడలో గంట కట్టాలని ప్రతిపక్షాలు సమావేశమయ్యాయి. పిల్లి మ్యావ్ అనగానే ఎలుకల అన్ని పారిపోయాయి. చంద్రబాబు నాయుడును మీడియా కాపాడుతుంది. చోడ వరం మినీ మహానాడు లో జనం లేక వెలవెల పోయింది. అయినప్పటికీ వారికి అర్థం కావడం లేదు. దివంగత నందమూరి తారక రామారావు, వైయస్ రాజశేఖర్రెడ్డి ల ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారని అన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ఎన్నో అవార్డులు అందుకున్న ఘనత ఉంది తను ప్రతిపక్షాలకు అవి ఏమీ కనిపించడం లేదు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబునాయుడు దిట్ట. పవన్ కళ్యాణ్ ను పనికిరాని వాడిగా తయారు చేసింది చంద్రబాబే. వ్యక్తిగతంగా పవన్ కళ్యాణ్ చాలా మంచి వ్యక్తి. పవన్ కళ్యాణ్ సినిమాలకు పరిమితం అయితే బాగుంటుంది. చంద్రబాబు నాయుడు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని మహిళ లను కించపరుస్తున్నారని ఆమె అన్నారు.

## తృటిలో తప్పిన భారీ ప్రమాదం..

ప్రకాశం బేస్తవారిపేట మండలంలోని పెంచికలపాడు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిద్రమత్తులో పొలాల్లోకి దూసుకెళ్లడంతో పది మందికి గాయాలయ్యాయి. ? శ్రీకాకుళం జిల్లా లచ్చపేట, పొన్నంపేట తదితర చుట్టుపక్కల గ్రామాల నుంచి 50 మందితో పలు ఆలయాలు సందర్శించుకొని శ్రీశైలం వెళ్తుండగా సంఘటన చోటచేసుకుంది..

# కర్నూలు నగరంలో సైబర్ నేరాల గురించి అవగాహన సదస్సు




**హాజరైన కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ ఐపియస్ , జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర్ రావు , జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్**

**సైబర్ నేరాల పట్ల అవగాహనతో అప్రమత్తంగా ఉండాలి**

**ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి**

**సైబర్ సేఫ్ ఆంధ్రప్రదేశ్ బుక్ ను ఆవిష్కరణ చేసిన కర్నూలు రేంజ్ డిఐజి, కర్నూలు జిల్లా ఎస్పీ**

కర్నూలు జూన్ 18 -: కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా " సైబర్ భద్రత-జాతీయ భద్రత " పై జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ డి.జీ.పి కె.వి రాజేంద్రనాథ్ రెడ్డి ఎఖూ గారి ఉత్తర్వుల మేరకు "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" లో సైబర్ భద్రత-జాతీయ భద్రత పై సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. పుల్లారెడ్డి, పుల్లయ్య, కెవి సుబ్బారెడ్డి, కెవిఆర్ కళాశాలల విద్యార్థులు, తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు శాఖ, సైబర్ భద్రత నిపుణులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. సైబర్ దాడులకు గురవుతున్న ఈ నేపథ్యంలో ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్ హ్యాక్ , క్రెడిట్ కార్డు సమాచారాన్ని చోరీ, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, ఫిషింగ్ మెయిల్స్ సైబర్ దాడుల గురించి తదితర సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించారు.ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ ఐపియస్ మాట్లాడుతూ రోజూ రోజూ కూ సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల గురించి యువత కుటుంబంలోని వారికి, ఇతరులకు అవగాహాన కల్పించాలన్నారు. ఆన్ లైన్ మోసాలు, లక్కీడ్రా మోసాలు, జాబ్ ఫ్రాడ్స్, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్, లింక్ లు క్లిక్ చేయాలంటూ వచ్చే మెసెజ్ లను నమ్మకూడదన్నారు. ఎక్కడైనా సైబర్ నేరాల గురైనట్లయితే ఈ క్రింది నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మిత్ర వాట్సప్ నెంబర్ 9121211100 , సిఐడి ఫ్యాక్ట్ ఫైండింగ్ వాట్సప్ నెంబర్ . 9071666667 ,నేషనల్ ఎమర్జన్సీ నెంబర్ 112 , పోలీసు డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర్ రావు మాట్లాడుతూ సాంకేతికత ఎంత మంచిదో అంతటి చెడు కూడా చేస్తుందన్నారు. ఒక అపరిచిత వ్యక్తి కలెక్టర్ పేరుతో గిఫ్ట్ ఆర్డర్ చేసి మోసం చేయడానికి ప్రయత్నించారని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండరాదని యువత కు సూచించారు. విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలే ఉన్నత స్థానాలకు చేరుస్తాయన్నారు. స్మార్ట్ ఫోన్లు మంచి కొరకు స్మార్ట్ గా ఉపయోగించుకుంటే జీవితం సాఫీ గా సాగి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటర్నెట్ ఉపయోగించడం తప్పనిసరి అయిన ప్రస్తుత పరిస్థితుల్లో సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. పోలీసు అధికారులు ఎంతో బిజిగా ఉన్నా కూడా ఈ కార్యక్రమంలో 2 గంటల పాటు సమయం కేటాయించి ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు.డిఐజి , జిల్లా ఎస్పీ భద్రత విషయంలో ముఖ్యంగా సైబర్ నేరాలలో ఎవరికి నష్టం కలగకుండా చూడడానికి ఎంతో పట్టుదలతో ఆశక్తి ఉన్నారని, పోలీసు శాఖ ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు అభినందిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని ఇందులో నేర్చుకున్న విషయాలను మిగతా వారికి తెలియజేయాలన్నారు. జిల్లా ఎస్పీ సిహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్ మాట్లాడుతూ సైబర్ దాడుల వల్ల వ్యక్తిగతంగా, ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందన్నారు. సోషల్ మిడియాలో ఫేక్ ఫోటో లను చూసి, ఆకర్షణకు లోనై మహిళలు మోసపోకూడదన్నారు. వెస్ట్ బెంగాల్, బీహార్, బంగ్లాదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల వారు ఎక్కువగా సైబర్ నేరాలకు పాల్పడుతుంటారన్నారు. అందరూ ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉంటే సైబర్ కేసులు ఎక్కువగా నమోదు కావు అన్నారు. సైబర్ నిందితుల ను అదుపులోకి తీసుకోవాలంటే చాలా ఖర్చులతో కూడుకున్న పని అన్నారు. 90 శాతం వరకు నిందితులను పట్టుకున్నామన్నారు. సైబర్ దాడుల విషయంలో ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజ్




ప్రొఫెసర్ ప్రేమ కుమార్ మాట్లాడారు. ఎలక్ట్రానిక్ పరికరాలలో యాంటీవైరస్ , మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు, ఫైర్‌వాల్‌లను , సాఫ్ట్ వేర్‌ను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. బలమైన పాస్ వర్డ్ లను సెట్ చేసుకోని సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై సైబర్ క్రైం నిపుణులు అవగాహన కలిగించారు .స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటాద్రి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థిని, విద్యార్దులు ఈ సదస్సు వలన ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవడం జరిగిందని పోలీసు శాఖకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి ధీరజ్ కునుబిల్లి, డీఎస్పీలు వెంకటాద్రి, మహేష్, సైబర్ సెక్యూరిటీ సర్వీసెస్ డైరెక్టర్ హైదరబాద్ శంతన్, పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల కు చెందిన ప్రొఫెసర్ ప్రేమ కుమార్ , కెవిసుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల చెందిన ప్రొఫెసర్ అతీక్ అహ్మద్, పుల్లయ్య కళాశాల, పుల్లారెడ్డి కళాశాల , కె వి సుబ్బారెడ్డి కళాశాల , కె.వి.ఆర్ మహిళా కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు .

# అంగన్వాడీ వర్కర్స్ వేతనాలు పెంచాలి -: సి ఐ టి యు డిమాండ్




నంద్యాల జూన్ 18 -: ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సి ఐ టి యు నంద్యాల జిల్లా కమిటీ సమావేశం నిర్మలమ్మ అధ్యక్షతన నంద్యాల లోని నరసింహయ్య భవనంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి ఏసురత్నం ఏ నాగరాజు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేబా మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు పెరుగు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఇప్పుడు ఇచ్చేటువంటి అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టంగా ఉంది అన్నారు, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు చిన్న పిల్లలకు నిత్యం సేవలందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళుతూ నిత్యం సేవలందిస్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు, 2017 వ సంవత్సరం నుండి పి ఎ, డి ఏ బిల్లు నేటికీ ఇవ్వడంలేదని ప్రాజెక్టు మీటింగ్ లో సెక్టార్ మీటింగ్ లకు తమ సొంత డబ్బుల తో చార్జీలు పెట్టుకుంటున్నా టి ఎ, డి ఎ బిల్లులు వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు, కూరగాయల బిల్లు లు గ్యాస్ బిల్లులు రేషన్ సరుకుల రవాణా బిల్లు లు తక్కువగా ఉన్నాయని ఈ బిల్లును పెంచాలని కోరారు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు పెంచిందని ఆ విధంగానే అంగన్వాడీ వర్కర్స్ కు హెల్పర్స్ కు రిటైర్మెంట్ వయసు అరవై రెండు సంవత్సరాలకు పెంచాలి , అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రిటైర్మెంట్ అయిన వారికి జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు అంగన్వాడీ వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి, అర్హత కలిగిన అంగన్వాడీ వర్కర్స్ కు సూపర్ సూపర్వైజర్ల గా ప్రమోషన్లు ఇవ్వాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీ వర్కర్స్ కు అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, ఈ సమావేశంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి ,సరస్వతి, శివలక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు అసెంబ్లీ ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నేత వేల్పులగోపాల్



కర్నూలు జూన్ 18 -:నెల్లూరుజిల్లా ఆత్మకూరుఅసెంబ్లీ ఉపఎన్నికల సందర్భముగా అనంతసాగరంమండల పరిధిలో భారతీయజనతాపార్టీ అభ్యర్థి అయిన గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్ గెలుపుకోసం సోమశిల మేజర్ పంచాయతీ గ్రామంలో ఎలక్షన్ క్యాంపెయిన్ ముమ్మరంగా జరుపుతున్న ప్రచారం బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వేల్పులగోపాల్ జోనల్ ఇంచార్జ్ ఆనంద్ కార్యవర్గ సభ్యులు అర్పణనరసప్ప పాల్గొన్నారు. క్యాంపెయిన్ చేస్తున్న సమయాలలో అక్కడి ప్రజలు ఎక్కడ చూసినా వీధి రోడ్లు వీధి విద్యుత్ కాలువలు రేషన్ ఇళ్ల నిర్మాణం అంశాలపై పేదబడుగు బలహీన వర్గాలు ప్రజలు అసంతృప్తిగా ఈరాష్ట్ర ప్రభుత్వంపై ఆవేదన పడుతున్నారు. భారతీయజనతాపార్టీ నాయకులు తెలుసుకొని పేదవాళ్లకు రాష్ట్రప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ప్రతిఒక్క పథకాన్ని వివరిస్తూ ఇప్పుడు జరిగే ఎలక్షన్లో బిజెపి కమలం గుర్తుకు ఓటువేసి గెలిపిస్తే భవిష్యత్తు కాలంలో చదువుకున్న విద్యార్థుల నుంచి రైతుల వరకు కేంద్ర పథకాల ఫలాలను వివరిస్తూ బిజెపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా భారతీయ జనతాపార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఈ ప్రచార కార్యక్రమాలలో బిజెపి నాయకులు శాంతాకుమార్ ఆనంద్ జగదీష్ కొండయ్య వసంత కుమార్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ వివాహానికి హాజరైన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి...!!!



ఓర్వకల్లు జూన్ 18 -: పాణ్యం నియోజకవర్గ పరిధిలోని, ఓర్వకల్ మండలం,కొంతలపాడు గ్రామంలో గ్రామ సర్పంచ్ మధు వివాహానికి పాణ్యం ఎమ్మెల్యే టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి , కాటసాని ఉమామహేశ్వరమ్మ హాజరయ్యారు.

# అమితాబ్ బచ్చన్ ఆంతేమ్.. పూరి కొడుకు బడా ప్లాన్




డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కొడుకు ఆకాష్ పూరి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే అతను ఇప్పటివరకు చేసిన సినిమాలు ఏవి కూడా బాక్సాఫీస్ వద్ద అనుకున్నంత స్థాయిలో సక్సెస్ కాలేకపోయాయి. నటుడిగా స్ట్రాంగ్ గా కనిపిస్తున్నప్పటికీ కూడా అతనికి సరైన కథలు తరగడం లేదు అని చెప్పాలి. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన మెహబూబా సినిమా తీవ్రంగా నిరాశపరిచిన విషయం తెలిసిందే.ఇక ఆ తర్వాత రొమాంటిక్ సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నప్పటికీ అది కూడా వర్కవుట్ కాలేదు. ఇప్పుడు చోర్ బజార్ సినిమాతో సక్సెస్ అందుకోవాలని ఆకాష్ పూరి గట్టి ప్రయత్నాలు చేస్తూ ఉన్నాడు.అయితే ఈ ప్రాజెక్ట్ పై పూరి జగన్నాథ్ ప్రమేయం ఏ మాత్రం లేకుండా ఆకాష్ తనకు సినిమాను ప్రమోట్ చేసుకునే విధంగా అడుగులు వేస్తున్నాడు. జార్జి రెడ్డి దర్శకుడు జీవన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో త్వరలోనే విడుదల చేయాలని ఆలోచిస్తున్నారు.అయితే సినిమాకు సంబంధించిన సాంగ్స్ కూడా జనాలకు చేరువయ్యేలా ప్రజెంట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు ఇక రీసెంట్ గా మంగ్లీ తో ప్రత్యేకంగా పాడిన అమితాబ్ బచ్చన్ కూడా ఎంతగానో ఆకట్టుకుంటుంది. అమితాబచ్చన్ అభిమానిగా ప్రత్యేకంగా ఆయన పేరు మీద ఒక స్పెషల్ సాంగ్ రిలీజ్ చేయడం బాగానే ఉంది.ఇక రవితేజ ఈ పాటను ప్రత్యేకంగా లాంచ్ చేశాడు..మదీన్ మ్యూజిక్ మంగ్లీ గానం మట్టపల్లి సుధాకర్ రచనకు ఆడియెన్స్ అయితే పాజిటివ్ గా స్పందిస్తున్నారు.ఈ పాట ఒకవైపు మాస్ ఆడియన్స్ ను మరొకవైపు క్లాస్ ఆడియన్స్ ను ఆకట్టుకునే విధంగా ఉంది. ఈ పాట అయితే ఆకాష్ పూరి చోర్ బజార్ సినిమా పై మంచి వైబ్రేషన్స్ క్రియేట్ చేసే అవకాశం అయితే ఉంది. ఏదేమైనా ఈ సినిమాతో సక్సెస్ అందుకోవాలని చూస్తున్న ఆకాష్ కు స్టార్టింగ్ అయితే మంచి బజ్ క్రియేట్ అవుతుంది. మరి సినిమా విడుదల తర్వాత ఎలాంటి టాక్ ను సొంతం చేసుకుంటుందో చూడాలి.




# కమల్ మాటల్ని 'విక్రమ్' నిజం చేసిందట

యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ దాదాపు నాలుగేళ్ల విరామం తరువాత 'విక్రమ్'తో బిగ్ బ్యాంగ్ ఇచ్చారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తన అభిమానులకు ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ తో బ్లాక్ బస్టర్ హిట్ ని అందించి సెలబ్రేషన్స్ మోడ్ లోకి వెళ్లిపోయారు. ఈ స్థాయి హిట్ ని ఊహించని కమల్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సూర్యకు రోలెక్స్ వాచ్.. దర్శకుడు లోకేష్ కనగరాజ్ కు అత్యంత ఖరీదైన కారు. చిత్ర బృందంలోని డైరెక్షన్ టీమ్ కు బైక్ లు.. ఇలా ప్రతీ ఒక్కరికి గిఫ్ట్ లతో తన ఆనందాన్ని పంచుకున్నారు.'విక్రమ్' మూవీతో పవర్ ఫుల్ కంబ్యాక్ ఇచ్చిన కమల్ ఈ సినిమా సాధిస్తున్న వసూళ్లపై తాజా స్పందించారు. ఈ మూవీ ప్రస్తుతం వరల్డ్ వైడ్ గా రూ. 300 కోట్ల వసూళ్లని రాబట్టింది. కేవలం రెండు వారాల్లోనే 'విక్రమ్' ఈ ఘపతపని సాధించడంతో కమల్ హాసన్ హర్షం వ్యక్తం చేయడమే కాకుండా చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత కొన్నేళ్లుగా కమల్ ఈ స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేదు. పైగా సొంత పార్టీ వ్యవహారాల్లో బిజీగా వుండటం వల్ల సినిమాల వైపుకు రాలేకపోయారు.ఆయన సినిమా విడుదలై దాదాపు నాలుగేళ్లు కావస్తోంది. ఈ నేపథ్యంలో విడుదలైన మూవీ 'విక్రమ్'. ఈ సందర్భంగా కమల్ స్పందిస్తూ 'తాను గతంలో ఈ మొత్తం సంపాదిస్తానని తనని నటించడానికి వదలాలని చెప్పానని అయితే ఆ సందర్భంలో తన మాటని ఎవరూ నమ్మలేదన్నారు. ప్రతి ఒక్కరు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చింతలేని నాయకుడు మనకు కావాలి. గతంలో నేను రూ. 300 కోట్లు సంపాదిస్తానంటే నా మాట ఎవరూ నమ్మలేదు. నా మాటల్ని అర్థం చేసుకోలేదు కూడా. 'విక్రమ్' వసూళ్లతో నా మాట ఇప్పుడు నిజమైంది. ఇప్పుడు నా అప్పులన్నీ తీర్చేస్తా. నాకు ఇష్టమైన ఆహారాన్ని తింటా. కుటుంబం సన్నిహితులకు చేతనైనంత సహాయం చేస్తా..నా దగ్గర వున్న డబ్బు మొత్తం అయిపోయాక ఇవ్వడానికి ఏమీ లేదని చెప్పేస్తా. వేరే వాళ్ల డబ్బుని తీసుకుని పక్కవాళ్లకు సాయం చేయాలనే ఉద్దేశం నాకు లేదు. నేను ఒక మంచి వ్యక్తిగా వుండాలనుకుంటున్నా' అని తెలిపారు కమల్.'విక్రమ్' సక్సెస్ తో రెట్టించిన ఉత్సాహంలో వున్న కమల్ హాసన్ త్వరలోనూ ఈమూవీకి సీక్వెల్ ని చేయబోతున్నానంటూ ప్రకటించిన విషయం తెలిసిందే. సీక్వెల్ తో 'విక్రమ్'లో రోలెక్స్ గా చిన్న పాత్రలో నటించి సూర్య రుణం తీర్చుకుంటానని ఇప్పటికే వెల్లడించారు కూడా.దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుందని తెలుస్తోంది. ఇదిలాఈ వుంటే రాజ్ కమల్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై మరిన్ని చిత్రాలని కూడా నిర్మించాలని కమల్ ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా వుంటే 'విక్రమ్' తమిళ చిత్రాల్లో 2022 లో అత్యధిక వసూళ్లని రాబట్టిన మూవీగా నిలవడం విశేషం.



# దేనినో చూసి భయపడినట్లున్నాడు.. డీకే రియాక్షన్ వైరల్

సౌతాఫ్రికాతో జరిగిన నాలుగో టి20 మ్యాచ్‌లో తన బ్యాటింగ్ మెరుపులతో దినేశ్ కార్తిక్ మరోసారి హీరో అయ్యాడు. బౌలింగ్‌లో ఆవేశ్ ఖాన్ నిప్పులు చెరిగినప్పటికి.. అంతకముందు బ్యాటింగ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడి టీమిండియాను నిలబెట్టిన కార్తిక్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా' నిలిచాడు. అయితే మ్యాచ్ మిడ్ ఇన్నింగ్స్‌లో కార్తిక్ ఇంటర్వ్యూ సమయంలో దేనినో చూసి బయపడినట్లు కనిపించింది. కార్తిక్ భయపడడం వెనుక ఉన్న కథేంటో ఇప్పుడు తెలుసుకుందాం.టీమిండియా ఇన్నింగ్స్‌లో తన ప్రదర్శనపై అడిగిన ప్రశ్నకు కార్తిక్ సమాధానం ఇచ్చే పనిలో ఉన్నాడు. ఈ సమయంలో ఒక్కసారిగా పైకి చూసిన కార్తిఇక్ ఏదో వస్తుందన్న తరహాలో భయానక రియాక్షన్ ఇచ్చాడు. కాసేపటికే తేరుకొని.. "సారీ అక్కడి నుంచి వచ్చిన బంతి నావైపు దూసుకొచ్చినట్లుగా అనిపించింది.' అంటూ పేర్కొన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే నాలుగో టి20లో టీమిండియా సౌతాఫ్రికాపై 82 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. తద్వారా ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 2-2తో సమంగా నిలిచింది. దినేశ్ కార్తిక్(27 బంతుల్లో 55; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెరీర్‌లో తొలి అర్థసెంచరీ సాధించాడు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6



వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆవేశ్ ఖాన్(4 వికెట్లు), చహల్(2 వికెట్లు) దెబ్బకు 7 పరుగులకే కుప్పకూలింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**